## క్లుప్తంగా

### లతకు సెంట్రల్ వర్సిటీ డాక్టరేట్



కాజీపేట: హనుమకొండ జిల్లా కేంద్రంలోని జీఎంఆర్ బృందావన్ కాలనీకి చెందిన గాదెపాక లతకు గౌరవ డాక్టరేట్‌ను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రకటించింది. కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి ప్రొఫెసర్ సూరంపుడి బాపిరాజు పర్యవేక్షణలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ప్రైవసీ ప్రిసర్వింగ్ మెథడ్స్ ఫర్ క్లాసిఫికేషన్ అండ్ క్లస్టరింగ్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ డాటా అనే అంశంపై లత పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్స్ విభాగంలో గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన తొలి మహిళగా లతకు అత్యంత అరుదైన గౌరవం దక్కింది.

### 4వరకు డిగ్రీ అడ్మిషన్లు

ఖిలా వరంగల్: ఈనెల 4వ తేదీ వరకు డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో శుక్రవారం జరిగిన అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగశాయిపేట డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో బీఏ, బీకామ్ (సీఏ), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్), బీఎస్సీ (లైఫ్ సైన్స్), కంప్యూటర్స్ కోర్సులు (చాయిస్ బెస్ట్ క్రెడిట్ సిస్టం) ప్రకారం విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకునే సౌకర్యం ఉందని వివరించారు. సమావేశంలో దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రత్యేక ఓటరు నమోదు క్యాంప్

హసన్‌పర్తి: శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ చల్లా ప్రసాద్ తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండే వారందరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

### సత్ప్రవర్తనతో మెలగాలి



మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని ఇన్‌స్పెక్టర్ వేణు హెచ్చరించారు. మడికొండ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు ప్రవర్తన మార్చుకోకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని పేర్కొన్నారు. ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సై చంద్రమౌళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ధర్నాను విజయవంతం చేయాలి

హన్మకొండ: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న వరంగల్ మహానగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని వడ్డెపల్లి బాలయ్య హోటల్ వద్ద, గోకుల్ కూడలి, పబ్లిక్ గార్డెన్, ఎల్‌బీసీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ కార్మికుల అడ్డాల్లో కరపత్రాల ద్వారా కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జేఏసీ నాయకుడు వేల్పుల ధర్మరాజు, మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాస బాబు పాల్గొన్నారు.

### ఘనంగా తీజ్ వేడుకలు



కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి తీజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తీజ్ ఉత్సవాలు గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని కొనియాడారు. అనంతరం యువతులతో కలిసి ఆయన ఉత్సాహంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్కే శ్రీలేఖ, కంకణాల సంపత్‌రెడ్డి, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ధర్నాకు తరలిన నాయకులు

విద్యారణ్యపురి: పీఆర్సీ వేయాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే పలు డిమాండ్ల సాధనకు హైదరాబాద్‌లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈమేరకు హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో ధర్నాకు శుక్రవారం తరలివెళ్లారు.

# పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి



కాశిబుగ్గ: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశిబుగ్గ: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రి సీపీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా భావిస్తూ సీపీఎస్‌కు వ్యతిరేకిస్తూ ఆయుర్వేద ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ శిరీష, డాక్టర్ మైదం రాజు, సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

**సీపీఎస్ రద్దు చేయాలని వినతి**

కాజీపేట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, రావులకార్ వెంకటేష్ పాల్గొన్నారు.

**కాజీపేట తహసీల్దార్‌కు వినతి**

కాజీపేట అర్బన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్‌కు పీఆర్టీయూటీఎస్ కాజీపేట మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండల శాఖ అధ్యక్షుడు దేవిరెడ్డి మాలకొండారెడ్డి, వీరయ్య, మనోజ్, కోమల్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# గడపగడపకు సంక్షేమ పథకాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్, తదితరులు

రామన్నపేట: తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఒక్కో డివిజన్‌కు రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తూ గడపగడపకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకెళ్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 11, 29వ డివిజన్లలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మేయర్ సుధారాణితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం శంకుస్థాపన చేసి, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి



శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కరీమాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని విప్లవ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్సకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్లు కేవలం ఎన్నికల స్టంట్‌గా మారుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. పోస్టుల భర్తీపై సర్కారు పూటకో మాట మార్చుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పీవైఎల్, ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ నాయకులు ఎలకంటి రాజేందర్, రాచర్ల బాలరాజు, అశోక్, రంజిత్‌కుమార్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి**

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపి వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిర్మలాదేవి, రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 11నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు వివరించారు. కనీస వేతనం, పింఛన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత లాంటివి అమలు చేయాలని సూచించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, రుక్మిణి, లక్ష్మి, వనిత తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం.. మహాదానం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

హన్మకొండ: నేత్ర, అవయవ దానం.. మహాదానాలని తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి కొనియాడారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు నేత్ర, శరీర, అవయవ దానాలకు ముందుకు రావాలని కోరారు. మరణించిన 8గంటల లోపు మృతుడి రెండు కళ్లను సేకరిస్తే ఇద్దరు అంధులకు చూపు కల్పించవచ్చని వివరించారు. అలాగే, శరీర, అవయవ దానం విద్యార్థులకు వైద్యవిద్యకు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా 20మంది నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చి ప్రతిజ్ఞ పత్రాలను అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు నరేందర్ రెడ్డి, సత్యనారాయణ, ఆదిరెడ్డి ఉపేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నేత్ర, అవయవ దానం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, సలహాదారుడు రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి అనంతల కేదారి పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ, మడేలయ్య బోనాలు



మడికొండ: పోచమ్మ ఆలయంలో పూజలు



ఖిలా వరంగల్: మధ్యకోటలో..

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని పాత పోలీసు స్టేషన్ వద్ద ఉన్న పోచమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి కుమ్మర్లు శుక్రవారం మొదటి బోనం సమర్పించారు. అమ్మవారికి పంచామృత, పంచవర్ణ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి నిమ్మకాయల దండలు వేసి, చీరతో అలంకరించారు. అర్చకుడు ప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బుర్ర రాజేందర్, ప్రధాన కార్యదర్శి గాండ్ల భిక్షపతి, బొల్లికొండ రవీందర్, కొలిపాక వెంకటస్వామి, బొల్లికొండ వినోద్‌కుమార్, కామిని మల్లేష్, గౌడ సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, డైరెక్టర్లు సంపత్, రాజ్‌కుమార్, అఖిల్, సతీష్ పాల్గొన్నారు.

**కోటలో మడేలయ్య బోనాలు**

ఖిలా వరంగల్: శ్రావణమాసం సందర్భంగా ఖిలా వరంగల్ మధ్య కోటలోని మడేలయ్య ఆలయంలో శుక్రవారం బోనాల పండుగను నిర్వహించారు. ఆలయాల అభివృద్ధి కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో మడేలయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు సమర్పించారు.

# సప్త గురుధామంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

వరంగల్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ములుగురోడ్డులోని సప్త గురుధామంలో 151మంది ముత్తైదువులతో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించినట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో చేసుకునే వ్రతం కంటే సమష్టిగా పుణ్యక్షేత్రాల్లో చేసుకుంటే అధిక ఫలితం ఉంటుందని గురుదేవుల సన్నిధిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, సోమ రామయ్య, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, రాంరెడ్డి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టోలో ముదిరాజ్ రిజర్వేషన్ అంశం చేర్చాలి



నినాదాలు చేస్తున్న శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజ్ రిజర్వేషన్ అంశాన్ని రాజకీయ పార్టీలు చేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రిజర్వేషన్ సౌకర్యం లేక ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి చేర్చాలనే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. సమావేశంలో మెపా వ్యవస్థాపక బాధ్యులు, అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నీరటి రాజు, బోనాల రమేష్, సింగారపు రామకృష్ణ, పెండ్యాల కృష్ణ, పిట్టల రమేష్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**ఆటో డ్రైవర్ నిజాయితీ**



వరంగల్ చౌరస్తా: తన ఆటోలో మరిచిపోయిన 24 తులాల బంగారు ఆభరణాల బ్యాగును బాధిత మహిళకు 27వ డివిజన్ యాకూబ్‌పురకు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ.ఫైమొద్దీన్ తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, స్థానికులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు మహ్మద్ యూసుఫ్ అలీ, రిటైర్ ఎస్సై మహమ్మద్ గౌస్ ఖాన్, ముస్తఫా, కమ్రొద్దీన్ పాల్గొన్నారు.

**వైద్య ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి**

ఎంజీఎం: వైద్యారోగ్యశాఖలోని ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వైద్యారోగ్య సంఘాల ఐక్య వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆర్.ప్రకాశ్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సెంట్రల్ కోర్ కమిటీ నాయకులు బానోతు నెహ్రూచంద్ నాయక్, బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ గత 20ఏళ్లకు పైగా పనిచేస్తున్న కాంట్రాక్టు రెండవ ఏఎన్ఎంలు, యూరోపియన్ ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు గుగులోతు వీరేందర్, విద్యాసాగర్, హనుమా నాయక్, సంపత్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నిధుల మంజూరుపై హర్షం**

వరంగల్ చౌరస్తా: హంటర్ రోడ్డులోని ముంపు ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.158 కోట్ల స్పెషల్ ఫండ్ మంజూరు చేయడంపై ఆయా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గందె కల్పన, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

**ఆ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి**

హన్మకొండ: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ అబ్దుల్ హైకి శుక్రవారం వినతి పత్రం అందించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

**వాసవి క్లబ్ సేవలు అభినందనీయం**



హసన్‌పర్తి: వాసవి క్లబ్ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు ప్రశంసించారు. వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు దివంగత కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతిని హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి చంద్రసేన గుప్త అని గుర్తుచేశారు. పదకొండు మందితో ప్రారంభమైన వాసవి క్లబ్.. ప్రస్తుతం రెండువేల క్లబ్‌లతో దేశ, విదేశాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. తొలుత చంద్రసేన గుప్త చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కరంచంద్, ప్రతినిధులు నాగమల్ల సుధీర్, భీష్మనాథం, పురవర్ధన్, శంకర్, శ్రీనివాస్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి**



కాజీపేట అర్బన్: 31వ డివిజన్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లను హైకోర్టు ఆదేశాల మేరకు భూములు కోల్పోయిన దళితులకే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. న్యూశాయంపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్లను సీపీఎం కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ ప్రభుత్వం న్యూశాయంపేట దళితులు భూములను అన్యాయంగా లాక్కుని డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించిందని తెలిపారు. దాంతో హైకోర్టును దళితులు ఆశ్రయించగా, దళితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తొట్టె మల్లేశం, జంపాల రమేష్, చంటి, రవి, శివ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం**

కాజీపేట: ప్రశాంత్‌నగర్‌కాలనీ రాంలీల మైదానంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శృంగేరి శారదాపీఠం ఆస్థాన పౌరాణికులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పర్యవేక్షణలో విగ్రహాన్ని వేదపండితులు శనివారం ప్రతిష్ఠించనున్నారు.

**కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి**



కాజీపేట: కాజీపేట పట్టణం బాపూజీనగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పరిపాలన అనుమతుల జీఓ పత్రాలను జాంబవ సంక్షేమ సంఘం సభ్యులకు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విజయ్‌భాస్కర్‌ను సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇమ్మడి రవి, చిలువురు మల్లికార్జున్, గబ్బెట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**క్షతగాత్రుడికి పరామర్శ**

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి బాబు కుమారుడిని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. కార్యక్రమంలో సందెల విజయ్ కుమార్, దొంగల కుమార్, రాజిరెడ్డి, సత్యవరం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి ఓదార్పు**

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బోయిని కుమార్ యాదవ్ తండ్రి ఎల్లన్న (75) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో పాటు పుర ప్రముఖులు, నాయకులు పరామర్శించారు.

**ముగిసిన గణిత ఉపాధ్యాయుల శిక్షణ**

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనిధిశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న గణితశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్.శర్మ, సెంట్రల్ జైలు డీఎస్పీ వెంకటేశ్వర్లు, అజిత్, లోకేష్ కుమార్, ఆనందమోహన్, కనకయ్య తదితరులు హాజరయ్యారు.

# అగ్రరాజ్యంగా ఎదుగుతున్న భారత్





దామోదర్‌రావును సన్మానిస్తున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి: రానున్న 20 ఏళ్లల్లో భారతదేశం అగ్ర రాజ్య జాబితాలో చోటు సంపాదించి, ప్రపంచాన్నే శాసించే స్థాయికి ఎదుగుతుందని ఐనా టెక్ వేవ్ వ్యవస్థాక చైర్మన్ దామోదర్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూడకుండా స్వతహాగా ఐటీ కంపెనీలను ఏర్పాటు చేసుకుని మరో పది మందికి ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఫీజుల్లో మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులు తప్పనిసరిగా 75శాతం హాజరు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాథోడ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పశ్చిమ టికెట్ బీసీలకే ఇవ్వాలి



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పార్లమెంట్ పరిధిలో రెండు శాసనసభ స్థానాలను బీసీలకే కేటాయించాలని, అందులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ టికెట్ మాత్రం బీసీలకే ఇవ్వాలని మాజీ కార్పొరేటర్ రేపల్లె శ్రీనాథ్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. హనుమకొండ 4వ డివిజన్ పరిధి యాదవనగర్‌లోని ఆయన తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమను బీసీలకు కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరామని, అయితే పొత్తులో భాగంగా ఓసీలకు కేటాయించిందని పేర్కొన్నారు. ఈసారి తప్పనిసరిగా బీసీలకే టికెట్ ఇవ్వాలని సూచించారు. దాస్యం వినయ్‌భాస్కర్ బీసీ కార్డుతోనే ఎమ్మెల్యేగా గెలిసి, బీసీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో కట్ల శ్రీనివాస్, కొడిపాక గణేష్, భాస్కర్, రేపల్లె రంగనాథ్, సీతాశ్యాం పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

**తనిఖీల్లో రూ.4.39 లక్షలు స్వాధీనం**

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ, మామునూరు స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులపై వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మామునూరు సబ్ డివిజన్ ఏసీపీ సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు సురేష్, క్రాంతికుమార్ నేతృత్వంలో శుక్రవారం సాయంత్రం వేర్వేరుగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ కారులో సరైన ఆధారాలు లేని రూ.4 లక్షల 39వేలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో మిల్స్‌కాలనీ ఎస్సైలు శ్రీలత, పున్నంచందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**డ్రంకెన్ డ్రైవ్ కేసులోనలుగురికి జైలు**

మడికొండ: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి రెండవ తరగతి మెజిస్ట్రేట్ విద్యాసాగర్ రావు రెండు రోజులపాటు జైలుశిక్ష విధించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ గుజ్జెటి వేణు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మడికొండ చౌరస్తాలో పోలీసులు గురువారంతనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆడెపు శ్రవణ్‌కుమార్, ఎండీ.సలీమొద్దీన్, జిట్టా శ్రీనివాస్, రాపోలు హనుమంత్‌ను కోర్టు ఆదేశాల మేరకు మహబూబాబాద్ జైలుకు తరలించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, కోర్టు కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.

**మహిళను కాపాడిన పోలీసులు**

కాశిబుగ్గ: భర్తతో గొడవపడి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ మహిళను వరంగల్ జీఆర్పీ పోలీసులు కాపాడారు. ఈఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. అనంతరం భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

**వీధికెక్కిన ఇంటి గొడవ**

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పుకోటలోని అన్నదమ్ములు మధ్య గొడవ వీధికెక్కింది. దాంతో వారు పరస్పరం దాడులు చేసుకుని పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కారు. ఇరువురి ఫిర్యాదులపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డివిజన్ అభివృద్ధిని నిరూపిస్తాం..



మాట్లాడుతున్న నాయకులు

హసన్‌పర్తి: నగరంలోని ఒకటవ డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నాయకులు ప్రతిసవాల్ విసిరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఒకటవ డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఈమేరకు పెగడపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, ఆత్మ డైరెక్టర్ గనిపాక కల్పన మాట్లాడారు. ఇప్పటివరకు డివిజన్‌లో రూ.90 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరిగినట్లు వివరించారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ విజయ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్ పాల్గొన్నారు.